# నేటి తెలుగు కథ




"నా కథ పడింది, చూశావా?" ఆఫీసులో అడుగు పెట్టగానే వామనమూర్తి పత్రికతో ఎదురొచ్చాడు.

"దీనితో విశ్వం తప్ప, అందరూ రచయితలైపోయినట్టే!" అన్నాడు రాజమన్నారు నావైపు చూస్తూ.

నేను బలవంతాన నవ్వగలిగాను. మా ఆఫీసులో అటెండరు అప్పలస్వామి మొదలుకొని, మేనేజరు రాజమన్నారు దాకా అందరూ ఏవో కథలూ, కవితలూ రాసినవాళ్లే. నే నొక్కడినే సాహిత్య జ్ఞానం లేనివాడిగా ఈరోజు తేలిపోయాను. నాకు అర్జెంట్‌గా ఓ కథ రాసి రచయితనైపోవా లనిపించింది. దుంపల బడి నుండి డిగ్రీ కాలేజీ వరకు తెలుగు చదివి కూడా, తెలుగులో కనీసం ఒక్క కథైనా రాయకపోవడం అవమానంగా తోచింది. సలహా కోసం మధ్యాహ్నం మేనేజరు రాజమన్నారు గదికి వెళ్లాను. రాజమన్నారు మా ఆఫీసులో అందరికన్నా సీనియర్ రచయిత. 'యువతరాన్ని ఉర్రూత లూగించే కథ' అంటూ రాజమన్నారు కథలు పత్రికల్లో చాలా అచ్చయ్యాయి.

"కథ రాయడం సులువే. నువ్వు ఇంగ్లీషు నవలలు చదువుతూంటావా?" అడిగాడు రాజమన్నారు.

"చదవను. అయితే తెలుగులో కథ రాయడానికి ఇంగ్లీషు నవలలు, ఫ్రెంచ్ నవలలు చదవడ మెందుకు?"

"పోనీ, మంచి జనరల్ నాలెడ్జి, కరెంట్ ఎఫైర్స్ గురించి అవగాహన ఉన్నాయా?" రాజమన్నారు రివాల్వింగ్ ఛెయిర్‌లో గిర్రున తిరిగాడు.

నా తల తిరిగింది.

"నా కవేమీ తెలియదు. తెలుగు కథ రాయడానికి అవన్నీ అవసరమని నే ననుకోను. వస్తాను!" చెప్పి బయటపడ్డాను.

కానీ కథ రాయాలన్న కోరిక మాత్రం పోలేదు. రాజమన్నారులాంటి పెద్ద రచయితలను కాకుండా, కొత్తగా రచయితల జాబితాలో చేరిన వామనమూర్తిని సలహా అడిగితే బాగుంటుం దనిపించింది. వామనమూర్తి కూడా రాజమన్నారులాగే అంటాడేమో నని, రాజమన్నారు ఇచ్చిన సలహా, అది నాకు నచ్చని వైనమూ ముందే ఏకరువు పెట్టాను. సిగరెట్ ఓ రెండు దమ్ములు లాగిన తర్వాత చెప్పాడు వామనమూర్తి.

"చూడు, విశ్వం! రాజమన్నారు చెప్పింది కరెక్టే! మే మందరం రచయితలమైనది కూడా ఆవిధంగానే. అయితే నువ్వింకా ఫైల్లోకి రాలేదు కనుక ఓ సలహా చెప్తా విను. మన చుట్టూ ఉన్న రకరకాల వ్యక్తులనూ, వారి మనస్తత్వాలనూ, జరుగుతున్న సంఘటనలనూ బాగా అబ్జర్వ్ చెయ్యి! బోల్డు కథలకు సబ్జెక్టులు దొరుకుతాయి."

నాకు వెంటనే మా పనిమనిషి పైడమ్మ గుర్తుకొచ్చింది. పైడమ్మ గుడిసె మా ఇంటి దగ్గరే. మొగుడు, నలుగురు పిల్లలూ ఉన్న సంసారంలో సంపాదించేది పైడమ్మ ఒక్కర్తే. పైడమ్మని, మొగుడు యాదయ్య రోజూ తాగొచ్చి తంతూ ఉంటాడు. అది కష్టపడి సంపాదించిన డబ్బంతా లాక్కుపోతాడు. దాని బాధ చూడలేక ఒకసారి నేను యాదయ్యను గట్టిగా మందలించబోతే,

"మా యవ్వారాల్లో జోక్కం చేసుకుంటే మర్యాధ్దక్కదు బాబూ!" అంటూ పైడమ్మ నా మీద విరుచుకుపడింది. "ఔరా! పతివ్రత, లంటే ఇటువంటివారే కాబోలు!" అనుకున్నాను నే నప్పుడు.

పైడమ్మ కథ, అవార్డు సినిమాలా, సహజంగా, కరుణరస భరితంగా ఉన్నట్టనిపించింది నాకు.

ఓ శుభముహూర్తాన 'పతివ్రతమ్మ పైడమ్మ' అనే టైటిల్‌తో పైడమ్మ కథను కాగితం మీద కెక్కించి, జగదాంబ జంక్షన్‌లో ఉన్న పత్రికాఫీసుకి తీసుకెళ్లాను. రాజమన్నారు ఆఫీసులో పనిచేస్తున్నానని చెప్పగానే ఎడిటర్ చాలా మర్యాదలు చేసి, నన్ను కూర్చోమని చెప్పి, కథ చదవడం మొదలుపెట్టాడు.

"కొక్కొరొక్కో ! కోడి కూతతో పైడమ్మకు మెలకువ వచ్చింది. 'అప్పుడే తెల్లారిపోనాది కావాల. విస్సాం గోరింటికి బోయి కళ్లాపి సల్లాల' గొణుక్కుంది. రాత్రి మొగుడు తాగొచ్చి తన్నిన తన్నులకు ఒళ్లు నొప్పులు పెడుతూంటే బలవంతాన మంచం మీద నుండి లేచింది. నులక మంచం కిర్రున చప్పుడు చేసింది.

"ఏటే ఆ సప్పుడు ఎదవా? నన్ను తొంగోనివ్వవా!" అరిచాడు యాదయ్య.


"ఏట్నేదు మావా! వన్లోకి బోవాల. బాగా తెల్లారగానే వొచ్చి నీకు సద్ది కూ డెడతా! యాడకీ పోమాక!"

అంతవరకూ చదివి తల అడ్డంగా ఊపాడు ఎడిటర్.

"చూడండి, మిస్టర్ విశ్వం! మీ కథ థీమ్ బాగానే ఉంది కానీ, రచన మరీ పాత చింతకాయ పచ్చడిలా ఉంది. అసలు కథ ప్రారంభమే డైనమిక్‌గా, ఉత్కంఠ లాగించేలా ఉండాలి. అది మీ కథలో కొరవడింది. సారీ! ఈ కథ మేము వేయలేం!" కాగితాలు తిరిగి ఇచ్చేశాడు.

నిరాశగా బయటికొచ్చి బాల్కనీలో నిలబడ్డాను. నా ఉత్సాహమంతా పోయింది. ఉక్రోషంతో కథ కాగితాలను చింపి, ముక్కలు చేసి, మేడ మీద నుంచి కిందకు విసిరేసి వచ్చేశాను.

** ** **



## దసరా మామూలు

"సార్! దసరా మామూలండీ" అడిగాడు ఆ ఏరియా పోస్ట్‌మాన్.

"నీవు స్పీడ్ పోస్ట్‌మాన్‌వా? మామూలు పోస్ట్‌మాన్‌వా?"

"స్పీడ్ పోస్ట్‌మాన్‌ని కాదండీ! రోజూ మీ ఇంటికి ఉత్తరాలు తెచ్చే పోస్ట్‌మాన్‌ని!"

"స్పీడు పోస్ట్‌మాన్ అయితే వంద రూపాయలు ఇద్దామని! ఇదిగో, యాభై రూపాయలు!"

అమ్మిశెట్టి [గుంటూరు]

ఓ మూణ్ణెల్ల తర్వాత నేను నా కథ గురించి మరిచిపోతున్న తరుణంలో ఓ రోజు ఉదయం ఆఫీసు కెళ్లగానే స్టాఫందరూ గుమిగూడి ఏదో చర్చిస్తూ కనిపించారు.

"విశ్వం! మన రాజమన్నారు కథ పడింది, చూశావా?" పత్రిక చేతిలో పెట్టాడు వామనమూర్తి.

"అలాగా!" అందుకుని తిరగేశాను.

"ఆహా! ఏం కథ గురూ! కథంటే ఇలా ఉండాలి!" పొగుడుకుంటూ పోతున్నాడు మూర్తి.

"ప్రముఖ రచయిత రాజమన్నారు కలం నుండి వెలువడిన మరో సెన్సేషనల్ కథ 'పైడి ది గ్రేట్' " - అని పెద్ద అక్షరాలతో వేసి, ఆ కింద 'ఈ కథకు ఇన్‌స్పిరేషన్' అనే హెడ్డింగు కింద రాజమన్నారు వంకర టింకర అక్షరాల స్వంత దస్తూరితో రాసిన మేటరు అచ్చువేశారు.

ఆ ఇన్‌స్పిరేషన్ ఏమిటా అని ఆసక్తిగా చదివాను.

"మే 18, 1994 శక సంవత్సరం 1916.

"జగదాంబ జంక్షన్,

"విశాఖపట్నం,

"ఇండియా.

"సమయం భారత కాలమానం ప్రకారం ఉదయం 10:30:31. నేను పేవ్‌మెంటు మీద నడుస్తూ ఉంటే పైనుండి హఠాత్తుగా నా మీద ఏవో కాగితం ముక్కలు పడ్డాయి. వాటి మీద ఏదో తెలుగులో రాసి ఉంది. పైకి చూస్తే ఏమీ కనిపించలేదు. నా చుట్టూ రోడ్డు మీద అలాంటివే చాలా కాగితం ముక్కలు చెల్లాచెదురుగా పడినట్లు గమనించాను. ట్రాఫిక్‌ని లెక్కచేయకుండా వాటిన్నింటినీ కష్టపడి ఏరుకొచ్చి ఒకచోట చేర్చి, వాటి మీద ఏమి రాసి ఉన్నదో అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేశాను. ఆకాశం నుండి దేవుని సందేశంలా నా ముందు పడిన ఆ చిన్న కాగితం ముక్కలే ఈ నా 'పైడి ది గ్రేట్'కు ఇన్‌స్పిరేషన్."

నా కేదో అనుమానం వచ్చింది. ఓసారి కళ్లు నులుముకుని మళ్లీ చదివాను. అదే స్థలం, అదే సమయం. నా అనుమానం నిజమే నని తెలిసింది. అవి నేను చింపి పడేసిన కాగితం ముక్కలే. వెంటనే పేజీ తిప్పి కథ చదవడం మొదలుపెట్టాను.

"సమయం

"బ్యూనస్ ఎయిరెస్ 18:34:58

"లండన్ 22:29:58

"మాస్కో 00:59:58

"ఢిల్లీ 03:59:58.

"సరిగ్గా రెండు సెకండ్ల తరువాత ఢిల్లీకి దక్షిణంగా, ఇండియాకు ఆగ్నేయ దిశలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఒకప్పుడు వైజాగ్‌పట్నం అని పిలువబడిన ఇప్పటి విశాఖపట్నంలో పైడమ్మ గుడిసెలో 231 రూపాయలు పెట్టి కొన్న అలారం టైమ్‌పీస్ బీప్ బీప్ మని చప్పుడు చేసింది. పనిమనిషి పైడమ్మ ఉలిక్కిపడి మంచం మీద నుంచి లేచింది. ఒక్కసారిగా లేవడంతో ఆమె బాడీలో పుట్టిన కైనెటిక్ ఎనర్జీ ప్రకంపనాల రూపంలోని మెకానికల్ ఎనర్జీగా మంచానికి అందించబడి - మంచం చప్పుడైంది.

"వాట్ హాజ్ హాపెండ్ పైడీ!" అరిచాడు యాదయ్య.

"నథింగ్ హాజ్ హాపెండ్ యాదూ! ఇట్ ఈజ్ టైమ్ ఫర్ కళ్లాపి!"

"షిట్!" విసుక్కున్నాడు యాదయ్య.

"యాదూ! ఐ విల్ బి బ్యాక్ బై సెవనోక్లాక్! ఐ విల్ సెర్వ్ యు సద్దికూడు దెన్. ఓ.కే.!" గుడిసెలో నుంచి బయటకొచ్చింది పైడమ్మ ... ..."

"నేను పుస్తకం మూసేసి వామనమూర్తి కిచ్చేశాను.

"పూర్తిగా చదవకుండానే ఇచ్చేశా వేం?"

"అక్కర్లేదు. ఈ కాలంలో తెలుగు కథ ఎలా రాయాలో నా కర్థమైపోయింది!" నవ్వాను.

★

